# మలుపు

ఇందిర వసంత చిన్నప్పటినుండి ఒకే క్లాసు, ఒకే బెంచి. స్కూలుఫైనల్ కాగానే ఇందిర వాళ్ళ తల్లితండ్రులు ఆవిడ చదువు మాన్పించి పెళ్ళి చేశారు. వసంత కాలేజీలో చేరింది. చాలా రోజుల తర్వాత ఈ రోజు కల్సుకున్నారు..

"చెప్పవే విశేషాలు ? చుట్టూ అన్ని వుత్తరాలు పరుచుకుని కూర్చున్నావు. కొంపతీసి ప్రేమలేఖలు కావు కదా ! "అంది తన సందేహాన్ని వ్యక్త పరుస్తూ అప్పుడే అక్కడికొచ్చిన ఇందిర. ఇందిర లిల్లీ ఫ్లవర్‌లాగా వుంటుంది.

" ఏం ! అవి మాత్రం కాకూడదా ? " నవ్వుతూ అంది కనకాంబరం లాంటి వసంత.

" ఎందుకు కాకూడదులే. అయినా కాలేజీ చదువు అయిందిగా మరి మారేజీ ఎప్పుడు? " వసంత ముఖంలోకి చూస్తూ అడిగింది. అప్పుడు బయటకు తొంగిచూస్తున్న తన తాళి బొట్టును కొంగుకింది సందులోకి సర్దుకుంటూ..

పెళ్ళికాని ఆడపిల్లల ముందు వాళ్ళ పెళ్ళిళ్ళ సంగతులెత్తినప్పుడు ఎక్కడలేని సిగ్గు ముంచుకొచ్చి కొన్ని క్షణాలు ఓ మాదిరి ఉక్కిరిబిక్కిరవుతారు. వసంత కూడా అలాంటి అవస్థలోనే పడింది. ఏదో సిగ్గు ఆమె మాటలకు, చూపులకు అంతరాయం కలిగించింది. అయినా వెంటనే తమాయించుకొని -

" నా మ్యారేజీ విషయంలో అంత ఆత్రుత నీకెందుకే ? నేను కూడా తొందరగా నీలాగా కావాలనా? " అంటూ ఆమె ఐదు నెలల కడుపు చూసింది.

"మరి కాగూడదా, నేను కోరగూడదా? అయినా ఎంత చదివినా, ఏం చేసినా, పెళ్ళి ఎలాగో తప్పదులేవే. అసలది కాకపోతే జీవితానికి సంపూర్ణతెలా వస్తుంది" ఫిలాసఫర్‌లా అంది ఇందిర. పక్కన్నే వున్న స్టూల్ మీద కూర్చుంటూ.

"మొత్తం మీద మంచి అనుభవాన్నే సంపాదించావ్ "

"పోనీలే, నాకో వార్త తెలిసింది నిజమా ? "

ఏమిటది అన్నట్టు ప్రశ్నార్థకంగా చూసింది వసంత.

"కాలేజీ రోజుల్లో ఎవరో స్టూడెంటు నిన్ను లవ్ చేశాడట " నాకంతా తెలుసులే అన్నట్లు చూస్తూ అంది ఇందిర.

" ఎవరన్నారేమిటి ? "కొంచెం నవ్వుతూ అడిగింది.

ఎవరో అన్నారులే నిజమా, కాదా?

..............................

"ఎవరతను? ఏం పేరు? "

శేఖర్ ఆమె కళ్ళల్లో కదిలాడు. ముఖాన సిగ్గు మెరిసింది.

"మంచి పర్సనాలిటీనా ? " క్యూరియాసిటీతో అడిగింది.

"అందగాడే, మంచి కవికూడా. ఆయన రాసిన పాటలన్నీ నేను పాడేదాన్ని"

"అలాగా? ఏం పేరు " అని అడిగింది ఇందిర.

"శేఖర్ "అన్నది చిన్నగా.

"ఓయ్ , వినపడేటట్టు చెప్పు. పెళ్ళినాడు చెప్పినట్టు చెపుతావేమిటే ? స్నేహితుని పేరు చెప్పడానికి ఇంత సిగ్గా? " అని నవ్వుతూ అడిగింది.

"ఆయన గారి చేతలు నాకు నచ్చలేదు. అతను స్వయంగా తన మిత్రులతో ఏమేమో చెప్పేవాడట "

"అంటే ? " అర్థం కానట్లు అడిగింది ఇందిర మధ్యలోనే.

"ఆఁ నేనతన్ని ప్రేమిస్తున్నాని, అందుకనే తను రాసిన పాటలు పాడుతున్నానని నాకీవిషయాలన్నీ తెలిసినపుడు కోపమొచ్చింది. కానీ ఏమీ అనలేకపోయాను" అంది ఏదో మాదిరి పెదవులు కదిలిస్తూ.

"అంటే ప్రేమించావన్నమాట " అంది ఇందిర.

"ప్రేమించటమంటే బొమ్మలాటేమిటి ? " ఏదో లోతుల్ని ఊహిస్తూ అంది.

"అయినా కాకపోయినా ఈ రోజుల్లో చాలా మంది అలాగే అనుకుంటున్నారు. దానికి తోడు సినిమాలోటి ఆదర్శమవుతున్నాయి. అందులో చూడు, ఒక్క చూపో, ఒక్క మాటో చాలు ప్రేమించుకోవడానికి " అంది ఇందిర.

"అందుకే కొన్ని గంటల ఊహాజీవితం. ఇదేమో కొన్ని సంవత్సరాల నిజజీవితం. దానికి దీనికీ పొత్తు ఎక్కడ ? " పిడికిలిలోని పెద్దనవేలును కదిలిస్తూ.

"పోనీలే నీ సంగతేమయిందో చెప్పు " అని అడిగింది రెండు చేతుల్లో తన ముఖాన్ని వుంచి.

"ఇంకేముందీ నా చనువును చిలవలు పలవలుగా సృష్టించుకొని నలుగురిలో దృష్టిలో నన్ను చాలా చులకన చేశాడు. ఒకవేళ అతను నన్ను ప్రేమించాడే అనుకుందాం. మరి అందర్కీ ఎందుకలా చెప్పడం " అని మధ్యలో కాసేపు ఆగి పరధ్యానంగా చూసింది.

" ఎట్లైనయితేం నేను వాళ్ళింటికి వెళ్ళడం మానేసా. కాలేజీలో ఎప్పుడయినా ఎదురయితే తలొంచుకుని తప్పుకుపోయేదాన్ని. అంతటితో ఆగక ఇక ఉత్తరాలు వ్రాయడం మొదలుపెట్టాడు దొరగారు " అంటున్నప్పుడు ముఖం నిండా సిగ్గు పూసి బుగ్గలు ఎరుపెక్కాయి. కళ్ళలో ఒక విధమైన కాంతి మెరిసింది.

"ఏమని " ఈసారి తన రెండు చేతులను మోకాళ్ళ చుట్టూ పట్టి వుంచి, ఆత్రుతగా ఆమె వైపు పరిచి వున్న ఉత్తరాల వైపు చూస్తూ అడిగింది.

"ఇంకేమని, నిన్ను ప్రేమిస్తున్నానని. వాటినింకా జాగ్రత్తగా దాచిపెట్టా. ఏదో ఇప్పుడు ఎటూ తోచకపోతే వాటిని చదువుతూ కూర్చున్నా. ఇదిగో చదువుతూ వుండు. నేను కాఫీ పట్టుకొస్తా " అంటూ ఓ ఉత్తరాన్ని ఇందిరకిచ్చింది.

" నీ ప్రేమ ఉత్తరాన్ని నేను ఎట్లా చదవను ?" అని అడిగింది.

" ఫరవాలేదు చదువు" అంటూ వంటగది వైపు వెళ్ళింది.

ఇందిర చదవసాగింది.

ఏం వసంతా ! నా మీద కోపం వచ్చిందా ? ఈ మధ్య మా ఇంటికి రావడం అటుంచి, కనీసం ఒక్క మాట, ఒక్క చూపయినా లేదే ? నేను నిన్ను చూడకుండా ఉండలేను వసంతా. రోజుకొక్కసారయినా చూడంది, మాట వినంది ఉండలేను. అందం, ఆకర్షణ అటుంచి, కోటి వీణలు మీటినట్లు నీవు పాడుతుంటే అన్నీ మరిచి నీ ఒడిలో వాలిపోవాలని ఉంది. నిన్ను పొగుడుతున్నాననుకోకు. నిజం వ్రాస్తున్నా ఇప్పటికి శెలవు

- శేఖర్

ఉత్తరం పూర్తి అయ్యాక ఓ మాదిరి శ్వాస వదిలింది ఇందిర. అంతలో వసంత రెండు కాఫీ కప్పులతో వచ్చి ఒకటి ఇందిరకిచ్చి తానొకటి తాగుతూ కూర్చుంది.

"చదవడం అయిందా "

"ఆఁ అయింది. కానీ నీవేమని వ్రాశావు జవాబు " కప్పులోని కాఫీ సాసర్‌లోకి వంచుతూ అడిగింది.

"నేనేం వ్రాస్తాను. అసలు ఆయన మీద అప్పట్లో అలాంటి ఉద్దేశాలేవీ లేవే. అయినా ఇలాంటి విషయాలలో జవాబు వ్రాస్తే ఇంకేమయినా వుందా? ఒక్కొక్కసారి అవి ఎంతటి దారుణానికయినా దారితీస్తాయి. కానీ మరునాడు ఆయన చెల్లెలుకు ఉత్తరం చూపించి -

చూడు మీ అన్నయ్య ఎదుటి వ్యక్తి భావాలు గ్రహించకుండా ఇలా ఉత్తరాలు వ్రాస్తే ఎలా? అయినా ఆయన భ్రమ గానీ నేనెప్పుడూ ఆ దృష్టితో మెలగలేదే. పోగా ప్రేమించాలి, పెండ్లి

చేసుకోవాలి అన్న ఉద్దేశాలు ఇప్పుడే లేవు నాకు. ఏమో చూద్దాం. గ్రాడ్యుయేషన్ అయ్యాక, నా ఆశయాలకు దగ్గరగా వుండి నా కోరకలకు సరిపోయే వ్యక్తి తటస్థించిన నాడు అందరిలాగే నేనూ పెళ్ళి చేసుకోవడం తప్పదు కనుక అప్పుడాలోచిద్దాం అన్నాను. ఆ సంగతి మాధవి వాళ్ళన్నకు చెప్పిందేమో. ఆయన మరో ఉత్తరం రాశాడు " అంటూ ఇందిరకిచ్చింది.

వసంత గారికి,

నేను చాలా తొందర పడ్డాను. అంతకంటే భ్రమ పడ్డాను. మీరన్నట్లు ప్రతివారికీ ఆశయాలు, ఆదర్శాలు వుంటాయి నిజమే. తప్పేమీ కాదు. వెనుకా ముందు ఆలోచించకుండా మీకలా వుత్తరం వ్రాసినందుకు క్షమించండి. - శేఖర్

"పాపం, ఇప్పుడెక్కడున్నాడతను " అంటూ ఉత్తరాలను తిరిగి వసంతకిచ్చింది.

"మద్రాసులో వుంటున్నాడు. ఇప్పుడతను చాలా గొప్పవాడయ్యాడు "

"అంటే ? "

"సినిమాలకు మాటలు,పాటలువ్రాస్తున్నాడు.వేలకు వేలు సంపాదించి సంపన్నుడైనాడు"

" ఐ.సీ " ఆశ్చర్యంగా చూస్తుంది కాఫీ కప్పను కిందుచుంతూ.

"మొన్న స్టేట్ అవార్డు పొందిన "దర్పణం " సినిమా వుంది చూడు దాని కథ కూడా శేఖర్ వ్రాసిందే " తన చేతిలోని కాఫీ కప్పను కింద పెడుతూ.

"ఆ మధ్య మా యూనివర్సిటీ నుండి ఎక్స్‌కర్షన్‌కు వెళ్ళినపుడు మద్రాసులో వాళ్ళ ఇంటికి కూడా వెళ్ళాను. చిన్నపాటి మేడ, ఓ కారు మంచి అంతస్తులో సౌఖ్యమైన జీవితం. అంతస్తునే మార్చేస్తుంది "

"నీతో బాగా మాట్లాడాడా ? లేక వెనకటి సంగతి మనసులో పెట్టుకొని ..."

"అదేమీ లేదు, చాలా ఆప్యాయతగా మాట్లాడాడు. తన కారులోనే స్టూడియోలన్నీ త్రిప్పి చూపించాడు. సినిమా వాళ్ళతో, తన మిత్రులతో పరిచయం చేశాడు. ఇందూ! ఆ రోజు అతనితో తిరగ () " అంది చేతిగా జుల్ని సవరించుకుంటూ తన్మయత్వంతో.

"ఇంతకీ ఆయనకి పెళ్ళయిందా "

"కానట్టుంది "

"నట్టు, బోల్ట్‌కానీ, విషయం అడకకపోయావా? " కాస్త ముఖాన్ని చిట్లిస్తూ అడిగింది.

"ఇల్లాలు వున్న ఇల్లు, ఆలి వున్న మనిషిని గుర్తుపట్టలేమా " మళ్ళీ తానే.

" పడతావ్, పడతావ్ ఎట్ల పడతావేమిటి ? అంది ఇందిర. "

"కారులో దగ్గర దగ్గర కూర్చున్నాం, భుజాలు భుజాలు తగిలాయి"

" ఎపుడైనా సిటి బస్సెక్కి ప్రయాణం చేశావా? "

"చేశాను, చేస్తే - "

" ఏం లేదు, ఓసారి గుర్తుకు తెచ్చుకో చాలు " నవ్వుతూ అంది.

"ఛీ, పో నువ్వు మరీను "

"మొగబుద్ధే అది పోనీ "

"మరి ఇప్పుడయినా ఇవ్వరాదా జవాబు ఆయన మొదటి ఉత్తరానికి - "

" అదే ఆలోచిస్తున్నా - "

రాత్రంతా కూర్చుని శేఖర్‌కెలా ఉత్తరం వ్రాయాలో బాగా ఆలోచించింది. దాదాపు డజను కాగితాలను పాడు చేసి చివరకు ఓ ఉత్తరం వ్రాసింది.

శ్రీ శేఖర్ గారికి, నమస్కారములు

నేను మద్రాను వచ్చినపుడు అసలు మీరు నాతో మాట్లాడరనుకున్నా. కానీ మీరు చూపిన ఆప్యాయతకు, ఆతిధ్యానికి నన్ను నేను మురిసిపోయాను. మీతో గడిపిన ఆ రోజు మరపురానిది.

బ్రతికున్నంత కాలం మీ పక్కన చోటిస్తారని ఆశిస్తున్నాను. మీ ఉద్దేశ్యం తెలియపరుస్తూ వెంటనే ఉత్తరం వ్రాయండి. మీ జవాబు కోసం ఎదురుచూస్తుంటాను -

- వసంత

రోజులు దొర్లుతూనే వున్నాయి. ప్రతి దినము జవాబు కోసం ఎదురు చూస్తున్న వసంతకు బరువుగా ఓ వారం గడిచింది.

ఓ రోజు మధ్యాహ్నం వరండాలో నిలబడి రోడ్డు వైపు చూస్తుంది. ఎదురుగా రోడ్డు పక్కన ఓ అబ్బాయి అతి శ్రద్ధగా గాలిపటాన్ని ఎగరవేస్తున్నాడు. దారం వదులుతూ వుంటే అది పైపైకి పోతూ వుంది. అతని సంతోషానికి హద్దు లేదు. ఇంకా ఇంకా దారాన్ని వదులుతూనే వున్నాడు.

అది పైపైకి పోతూ వుంది. ఆమె చూస్తూ నిలబడింది.

అంతలో పోస్టు అన్న కేక వినపడింది. ఏదో సంతోషం వసంతనావరించింది. ఆశతో కూడుకున చూపుతో పోస్ట్‌మాన్‌ను సమీపించి కవరందుకొని అవధులు మించిన ఆనందంతో అడుగులు తడబడుతూ వుంటే మళ్ళీ వరండాలోకొచ్చి ఓ పిల్లరునానుకొని కవరు చించి ఉత్తరం చదువసాగింది.

వసంత గారికి -

మీ ఉత్తరం ముట్టింది. కానీ జవాబు ఎలా వ్రాయాలో తికమకపడుతున్నా. దప్పిక తీర్చుకోవడానికి నీరందని నేలకు దిగిన పక్షి, ఎండమావులని తెలుసుకున్న తర్వాత ఏం చేస్తుంది చెప్పండి ?

- ఎగిరిపోతుంది. మరెక్కడయినా నీరున్న చోటికి.

నేనూ అంతే !

మీ ఆశల్ని తీర్చలేనందుకు చాలా బాధ పడుతున్నాను. నా పెళ్ళి నిశ్చయమయింది. ఈ నెలాఖరులో కాబోతుంది కూడా. మీకు కూడా ఆహ్వానం పంపుతాను. తప్పకరండి. ఉంటా -

స్నేహితుడు

శేఖర్

అంత వరకు కళ్ళనిండా నిండిన నీరు ధారగా జారుతున్నాయి. ఉత్తరాన్ని పిడికిలితో నలుపుతూ తలెత్తి రోడ్డువైపు చూసింది. ఇందాక హాయిగా ఎగిరిన గాలిపటం దారం తెగి ఫట్లిలు కొడుతూ పడిపోతుంది. తనకు అందకుండా పోతున్న గాలిపటం వైపు అలాగే చూస్తూ నిలబడ్డాడా అబ్బాయి.

నవంబర్ 1979 ●

ముప్పది సంవత్సరాల క్రితం రాసిన కథ